క్లుప్తంగా

హెచ్‌ఎంకు సత్కారం



సత్యవాడలో హెచ్‌ఎం సాదే సత్యవతి, రాజేశ్ దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని సాదే సత్యవతి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సాదే సత్యవతి, రాజేశ్ దంపతులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగరాజు, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పుల్లయ్య, గోపాలకృష్ణ, ప్రదీప్, శ్రీను, ప్రేమ్, గ్రామ పెద్దలు సలాది వీరబాబు, మాచరరావు, పోలిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా 'వాడ్రేవు'



వాడ్రేవు శ్రీనివాస్

రామచంద్రపురం రూరల్: కోనసీమ జిల్లా పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామచంద్రపురం మండలం తాళ్లపొలం శివారు నవరత్నాలగరువు మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వాడ్రేవు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌ల నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ నియామకంపై ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి, పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చివరి వరకూ బోధన ఆయనకే చెల్లింది



శ్రీరామచంద్రమూర్తి, శైలకుమారి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: ఉద్యోగ విరమణ చేసే చిట్టచివరి క్షణం వరకు తరగతి గదిలో బోధన చేయడం ఆయనకే చెల్లిందని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో సోషల్ టీచర్‌గా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేసిన మహేంద్రవాడ శ్రీరామచంద్రమూర్తి సత్కార సభ పాఠశాల నిర్వహణ అనంతరం పాఠశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహ ఉపాధ్యాయులు మాట్లాడుతూ శ్రీరామచంద్రమూర్తి మాస్టారు తన సర్వీసులో అత్యంత తక్కువ సెలవులు ఉపయోగించుకున్న వ్యక్తిగా అందరి మన్ననలు పొందారన్నారు. ఉద్యోగ విరమణ రోజున కూడా విద్యార్థులకు చివరి క్షణం వరకు బోధించి వృత్తి పట్ల తన నిబద్ధత చాటుకున్నారన్నారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తి, శైలకుమారి దంపతులను దుశ్శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

6న పీడీఎస్ బియ్యం వేలం

మండపేట: ప్రభుత్వం సీజ్ చేసిన పీడీఎస్ బియ్యానికి ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నామని ఎంఎస్‌వో సుబ్బరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా సీజ్ చేసిన బియ్యాన్ని వేలం వేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. రైస్ షాపులు, హోల్‌సేల్ అండ్ రిటైల్ కిరాణా వర్తకుల దగ్గర నుంచి బియ్యం వ్యాపారుల వరకూ ఎవరైనా ఈ వేలంలో పాల్గొనవచ్చన్నారు. పాటదారులు ముందుగా రూ 2 లక్షల డీడీ తీసి జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. అదే రోజున ఉదయం 9 గంటలకు అందించిన డీడీని స్వీకరిస్తామని తెలిపారు. వ్యాపారి వివరాలు కూడా ఇవ్వాలని చెప్పారు. ఆధార్, జీఎస్టీ, పాన్ కార్డు జెరాక్స్ కాపీలు జత చేసి అందివ్వాలని కోరారు. అదేరోజున ఉదయం 10 గంటలకు అన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద వేలం నిర్వహిస్తామని ప్రకటించారు. వేలంలో పాల్గొనే వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులూ ఉండరాదన్నారు.

మీ కోసంలో 4 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో సుధాసాగర్

రామచంద్రపురం: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో మొత్తం 4 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో ఎస్.సుధాసాగర్ తెలిపారు. ఫించన్ మంజూరుకు 2, సదరం ధ్రువపత్రం, అక్రమంగా వేసిన గడ్డిమేటు తొలగింపునకు ఒక్కో అర్జీ వచ్చినట్లు తెలిపారు. పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంతవరకూ పాటిస్తారో..

- రోడ్లను ఛిద్రం చేస్తున్న వీల్స్ ట్రాక్టర్లు
- యజమానులను హెచ్చరిస్తున్న అధికారులు



రహదారిపై యథేచ్ఛగా వెళుతున్న వీల్స్ ట్రాక్టర్



వీల్స్ ట్రాక్టర్ల కారణంగా ఛిద్రమైన ఆర్‌అండ్‌బీ రహదారి

రాయవరం: ఏటా ఖరీఫ్, రబీ సమయాల్లో వీల్స్ ట్రాక్టర్లు రహదారులను ఛిద్రం చేస్తున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో కూడా వీల్స్ ట్రాక్టర్లు రహదారులపై యథేచ్ఛగా తిరుగుతూ రహదారులకు నష్టం కలిగిస్తున్నాయి. రూ. లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్లు కొందరి నిర్లక్ష్యం వల్ల శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. పంట చేలను దమ్ము చేయాల్సిన వీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై వెళుతూ వాటిని ఛిద్రం చేస్తున్నాయి. రహదారులపై వీల్స్ ట్రాక్టర్లు తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు జారీ చేస్తున్న హెచ్చరికలను ట్రాక్టరు యజమానులు ఎంతవరకూ పాటిస్తారో చూడాల్సి ఉంది.

అన్ని రోడ్లదీ అదే పరిస్థితి

క్లస్టర్ పరిధిలోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో పలు గ్రామీణ రోడ్లు వీల్స్ ట్రాక్టర్ల రాకపోకవలతో ఛిద్రమవుతున్నాయి. పలు గ్రామీణ రహదారులపై వీల్స్ ట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వెళ్లడంతో ఆ రహదారులు కొద్ది రోజులకే ఛిద్రమయ్యాయి. నియోజకవర్గంలోని ఇటీవల కొత్తగా నిర్మించిన పలు రహదారులు వీల్స్‌ట్రాక్టర్ల కారణంగా రోజురోజుకూ మరింత అధ్వాన్నంగా మారుతున్నాయి.

హెచ్చరికలు పాటిస్తారా?

ప్రస్తుత ఖరీఫ్‌లో ట్రాక్టర్ యజమానులు తిరిగి వీల్స్ ట్రాక్టర్లతో రహదారులను ఛిద్రం చేస్తారని భావించిన అధికారులు ముందుగానే ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీవో, పోలీసు, ఆర్‌అండ్‌బీ అధికారులు స్థానిక పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహిస్తున్నారు. వీల్స్ ట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. క్లస్టర్ పరిధిలో సుమారు 800కు పైగా ట్రాక్టర్లు ఉన్నట్లు సమాచారం.

సమస్యకు పరిష్కారం ఉన్నా..

రోడ్ల నిర్మాణంతో కష్టాలు తీరతాయని ప్రయాణికులు భావించినా కొద్ది రోజులకే అవి నాశనం అవుతున్నాయి. నాణ్యతా లోపాలకు తోడు వీల్స్ ట్రాక్టర్ల వీరవిహారం కూడా కొద్ది కాలానికే రోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. వీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై ప్రయాణించేటపుడు చక్రాలకు ఇనుప బద్దె ఏర్పాటు చేసుకోవాలి. ఇనుప బద్దె ఏర్పాటు చేయక పోవడంతో అవి ప్రయాణించే సమయంలో రోడ్లను నరుకుతున్నాయి. ఫలితంగా రోడ్లు ఛిద్రమై శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. ఒక ఇనుప బద్దె ఏర్పాటుకు రూ.2 వేల వరకూ ఖర్చవుతుంది. ట్రాక్టర్ యజమానులకు అది స్వల్ప మొత్తమే అయినా పాటించడం లేదు. కొంతమంది పాటిస్తున్నా..అధిక సంఖ్యలో ట్రాక్టర్లు వీల్స్‌కు బద్దెలు అమర్చుకోవడం లేదు. ఖరీఫ్, రబీ వరినాట్ల సమయంలో రహదారులపై వీల్స్ ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. రహదారులను నాశనం చేస్తున్న వీల్స్ ట్రాక్టర్లపై ఫిర్యాదు ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి పౌరుడికి ఉన్నా మన కెందుకులే అనుకోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురవుతోంది.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి



చక్రాలకు బద్దెలు అమర్చుకోకుండా రోడ్లపై తిరిగే వీల్స్ ట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. పర్యవేక్షణ ముమ్మరం చేయాల్సిందిగా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు ఆదేశాలు ఇస్తున్నాం. ట్రాక్టర్ యజమానులు ఆదేశాలను కచ్చితంగా పాటించాలి.

– ఆర్‌వీ కృష్ణారావు, తహసీల్దార్, రాయవరం

సీజ్ చేస్తాం



నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై తిరిగే వీల్స్ ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. యజమానులు వెంటనే వీల్స్ ట్రాక్టర్లకు ఇనుప బద్దెలు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా తిరిగే ట్రాక్టర్ల వివరాలను ప్రజలు తెలియజేయాలి.

– జి.నరేష్, ఎస్ఐ, రాయవరం

డయేరియాతో అప్రమత్తంగా ఉండాలి

రామచంద్రపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ డయేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. పట్టణంలో గల కొత్తూరు వార్డు అంగన్వాడీ సెంటర్‌లో 'స్టాప్ డయేరియా' క్యాంపెయిన్‌ను మంత్రి సుభాష్ ప్రారంభించారు. ఈనెల 1 నుంచి ఆగస్టు 31 వరకు జరుగుతుందని ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పిల్లలకు డయేరియా లక్షణాలు ఉన్న పిల్లలను గుర్తించి వైద్యం అందిస్తారని, డయేరియాపై అవగాహన కల్పిస్తారని పిల్లల తల్లిదండ్రులు వీటిని ఉపయోగించుకోవాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పిల్లలకు డయేరియా లక్షణాలు ఉంటే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు 14 రోజులు వరకు అందిస్తారన్నారు. దీని ద్వారా అతిసార వ్యాధి నియంత్రణలోకి వస్తుందని తెలిపారు. సబ్ డివిజనల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, సురక్షిత నీటిని తాగడం, డయేరియా రాకుండా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, డాక్టర్లు హరీష్, హేమసుధీర్, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, కౌన్సిల్ సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి, సూపర్వైజర్ నాగమణి ఎం.దుర్గా, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులను సత్కరించిన పీఎంపీ సంఘం



రాయవరంలో డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, గోపీకృష్ణారెడ్డి, ప్రత్యూషరెడ్డిలను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ నేతలు



కపిలేశ్వరపురంలో వైద్యులను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ నాయకులు

రాయవరం: భగవంతుడు ప్రాణం పోస్తే వైద్యులు ఆ ప్రాణాలను కాపాడుతూ ప్రాణదాతలు అవుతారని రాయవరం, అనపర్తి, బిక్కవోలు మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ అన్నారు. రాయవరంలో సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిని దైవంగా భావిస్తూ పలువురు వైద్యులు వ్యక్తిగత జీవితాన్ని కూడా కోల్పోతుంటారన్నారు. డాక్టర్స్‌డేను పురస్కరించుకుని ఏటా రాయవరం, బిక్కవోలు మండలాల వైద్యులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాయవరం, బిక్కవోలు, అనపర్తి మండలాలకు చెందిన వైద్యులు జీఎస్ఎన్‌రెడ్డి, జి.గోపీకృష్ణారెడ్డి, ప్రత్యూషరెడ్డి, తేతలి నవీన్‌రెడ్డి, కె.కృష్ణారెడ్డి, తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ నేతలు చింతా జగదీష్, బాబూరావు, ద్వారంపూడి సాయిరామారెడ్డి, శ్రీను, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు గుర్తింపునిస్తాయి

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వాసుపత్రుల ద్వారా అందించే సేవలు వైద్యులకు మంచి గుర్తింపును ఇస్తాయని జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. మండలంలోని కపిలేశ్వరపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమార్, వైద్య సిబ్బందిని పీఎంపీ అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ళ రాంబాబు, జిల్లా కార్యదర్శి సూరంపూడి భద్రరావు, ఎంపీటీసీ డాక్టర్ అద్దాల శ్రీనివాస్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నిరుపేదలకు అందించే వైద్య సేవలు ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఆల్‌వీఎల్ నారాయణ, కూళ్ల శ్రీనివాస్, కడలి భద్రరావు, కనికెళ్ళ సుధాకర్, కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో మంత్రి సుభాష్ సుడిగాలి పర్యటన



పీహెచ్‌సీని పరిశీలించి వైద్యాధికారులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక పీహెచ్‌సీని సందర్శించిన మంత్రి సుభాష్ ముందుగా వైద్యాధికారులకు అంతర్జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, వసతులపై ఆరా తీశారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో తరగతి గదులను సందర్శించి మధ్యాహ్న భోజన పథకంపై విచారణ చేపట్టారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కొద్దిసేపు విద్యార్థులతో వాలీబాల్ ఆడి వారిని ఉత్తేజ పరిచారు. గ్రామంలో కరప, కాజులూరు మండలాల్లోని 26 గ్రామాలకు మంచినీరు అందించే భారీ రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించి ఐదు నెలలుగా సిబ్బందికి జీతాలు అందటం లేదన్న ఫిర్యాదులపై కాంట్రాక్టరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వైఎస్సార్ కాలనీ రహదారిని, ఆదిమూలల కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరలో అన్ని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ, ఆర్యావటం మాజీ సర్పంచ్ కోట తాతబ్బాయి, స్థానిక నాయకులు చందాల బాబి, కంచుస్తంభం బుజ్జి, దేగల సతీష్, ఏడిద నాని, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పింఛన్ల పంపిణీ ప్రారంభం



మండపేటలో మున్సిపల్ కమిషనర్ చేత పింఛన్ ఇప్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



అంగరలో పింఛన్లను అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మండపేట: ఎన్టీఆర్ పింఛన్ భరోసా పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఉదయాన్నే పట్టణంలోని పాటి మీద సచివాలయంలో పెంచిన పింఛన్ల పంపిణీని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణితో కలసి ఆయన చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.రాము, కూటమి నాయకులు పాల్గొన్నారు. కాగా దివ్యాంగుల పింఛను మొత్తం పెంపుపై ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దూలి జయరాజు మాదిగ హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని 7, 8 వార్డులతో పాటు 30వ వార్డు రాజీవ్ గృహకల్ప కాలనీలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లు అందించారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో సోమవారం వివిధ రకాల సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పింఛను సొమ్ములను లబ్ధిదారులకు అందజేశారు. 10,230 మందికి పింఛన్లు అందించాల్సి ఉండగా తొలి రోజైన సోమవారం 9,628 పింఛన్లను అందజేసి 94.12 శాతాన్ని నమోదు చేశారు. అచ్యుతాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

రామచంద్రపురం మండలంలో..

రామచంద్రపురం రూరల్: రూరల్ మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో 96.14 శాతం పింఛన్ల పంపిణీ మొదటి రోజైన సోమవారం జరిగినట్లు ఎంపీడీఓ ఎన్‌వీ రామచంద్రమూర్తి విలేకరులకు తెలిపారు. పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులను ఆయన అభినందించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమాల్లో ఉద్యోగులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో మంత్రి సుభాష్

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లిలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం పింఛన్ పంపిణీలో పాల్గొన్నారు. పెంచిన పింఛన్ రూ.4 వేలతో పాటు గత నెల బకాయి రూ.3 వేలు, అదే విధంగా దివ్యాంగులకు పెంచిన పింఛన్ రూ.6 వేలు, గత నెల పింఛన్ రూ.3 వేలు కలిపి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటు పడాలి



సమావేశంలో పాల్గొన్న అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం నాయకులు

కాజులూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మండల దళిత యూత్ అసోసియేషన్ (అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం) వ్యవస్థాపక అధ్యక్షుడు పులుగుమాటి నరసింహమూర్తి మాస్టారు అన్నారు. కాజులూరు అంబేడ్కర్ భవన్‌లో సోమవారం మండల సంఘం అధ్యక్షుడు మాత వెంకటేశ్వర్లు అధ్యక్షతన సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ముందుగా సంఘ అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణపైనా చర్చలు జరిపారు. అనంతరం దళిత అనే పదం నిషేధించబడినందున మండలంలో ఇప్పటి వరకూ కొనసాగిన మండల దళిత యూత్ అసోసియేషన్ పేరును అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘంగా మార్పు చేస్తున్నట్టు వ్యవస్థాపక అధ్యక్షుడు పులుగుమాటి నరసింహమూర్తి ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మండల గ్రామాల్లో మండల దళితయూత్ అసోసియేషన్ అనేక కార్యక్రమాలు నిర్వహించిందని ఇకపై అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం నిర్వహించే కార్యక్రమాలకు సంఘ సభ్యులు సహాయ, సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మాత నూకరావు, పోతు శ్రీనివాసు, ఎం గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 25 శాతం సీట్లు కేటాయించాలి

మండపేట: కేంద్ర ప్రభుత్వం 2009లో తీసుకువచ్చిన రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లను పేదలకు కేటాయించాలని హైకోర్టు న్యాయవాది టపా వీర గోవిందరావు కోరారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దీనిపై ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ అమలు పరచడంలో విద్యాశాఖాధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. ఉత్తర్వులు అమలు చేయని ప్రైవేటు విద్యాసంస్థలను రద్దు చేయాలని అధికారులను ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం పేదలకు 25 శాతం సీట్లు కేటాయింపునకు వీలుగా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్టాప్ డయేరియాపై విస్తృత ప్రచారం



కపిలేశ్వరపురంలో అతిసార వ్యతిరేక మాసోత్సవ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వైద్యులు, సిబ్బంది



రాయవరంలో డయేరియా మాసోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ తదితరులు

మండపేట: డయేరియా వ్యాధి ప్రబలకుండా స్టాప్ డయేరియాను సమర్థవంతంగా అమలు చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హరిజనపేటలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆసుపత్రి వైద్యురాలు కె.రమాలక్ష్మి, కాలనీ హెల్త్ సెంటర్ వైద్యురాలు వి.భవానీలు డయేరియా రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పట్టణంలోని 7, 8 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు.

కపిలేశ్వరపురం: అతిసార వ్యాధిని అందరూ అవగాహనతో ఎదుర్కోవాలని మండలంలోని అంగర, అచ్యుతాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు పీఎస్‌ఎస్‌డీ రత్నకుమారి, కరుణేంద్రకుమారి కపిలేశ్వరపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ అన్నారు. అతిసార వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయా ఆసుపత్రుల ఆధ్వర్యంలో గ్రామాల్లో అతిసారపై అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ప్రభుత్వం రూపొందించిన పోస్టర్లను ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు దాయం కావేరి, రెడ్డి సుజాత, ఎంపీహెచ్‌ఈఓలు జిత్తుక మల్లిఖార్జునుడు, సీహెచ్ గోపాలకృష్ణ, హెచ్‌ఈ బి.రామారావు, హెచ్‌వీ తాతపూడి మేరీమణి, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయవరం: అలసత్వం వహిస్తే అతిసారంతో ఆయువుకే ప్రమాదకరంగా మారుతుందని, ముఖ్యంగా చిన్నారులకు ప్రాణ సంకటం అవుతుందని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. రాయవరం పీహెచ్‌సీలో డయేరియా నియంత్రణ మాసోత్సవాలను ఆయన సోమవారం ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనిరుధ్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేత వుండవిల్లి రాంబాబు, తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావు, పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వాణికుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ సరోజని, ఎంపీహెచ్‌ఈవో తులసిదాస్, హెల్త్ విజిటర్ సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ ఆకస్మిక తనిఖీ



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌ను రామచంద్రపురం డీవైఈఓ ఎస్ఎల్ నరసింహ ఫణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి మురుగు నీరు వెళ్లడానికి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పథకంలో ప్రతీ విద్యార్థి భోజనం చేసేలా చూడాలన్నారు. డివిజన్‌లోనే అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలగా ఉన్న రికార్డును కొనసాగేలా చూడాలని కోరారు. అందుకోసం స్థానికంగా ఉండే ఉపాధ్యాయులు చొరవ తీసుకుని అడ్మిషన్లు మరింత పెరిగేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశ బోధన కృత్యధారా విధానంలో జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు, బోధన విషయాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ రత్నపద్మావతి, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు ఉమాపతి శాస్త్రి, అరవ విస్సు, కోడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించాలి

మండపేట: అధికారులు విధిగా ప్రొటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్లో నిర్వహించిన స్టాప్ డయేరియా కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి రాకపోవడంపై ఆయన ఆరా తీశారు. దానికి అధికారులు స్పందిస్తూ ఎమ్మెల్యే ఒకరినే ఆహ్వానించి కార్యక్రమం చక్కబెట్టడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ఏ అధికారి అయినా సరే ప్రొటోకాల్ నిబంధనలు పాటించాలని చెప్పారు. తెలియక చేసిన తప్పు పర్వాలేదని, మరోసారి ఇలాంటి తప్పు జరగకుండా చూసుకోవాలని చెప్పారు.

శిలాఫలకాలు ధ్వంసం చేస్తే సహించేది లేదు

కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో ఎవరో శిలాఫలకం పగులగొట్టారని తనకు ఫోన్ కాల్ వచ్చిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. కొంత కాలంగా ఇదే ఒరవడి మండపేట నియోజకవర్గంలో చోటుచేసుకుంటుందని అన్నారు. ఇలా ఎంతకాలం ఇలాంటి పనులు చేస్తారని ప్రశ్నించారు.